క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరగనున్నట్లు కమిషనర్ జబ్బార్‌మియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఏఓకు సన్మానం

పామిడి: ఇటీవల గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అధికారిణిగా అవార్డు అందుకున్న మండల వ్యవసాయాధికారిణి డీ లీనా వసుంధరను సోమవారం ఎరువుల దుకాణదారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రెడ్డి, సభ్యులు దుర్గా శీనా, రత్న ప్రభాకర్, రామచంద్రారెడ్డి, సంజీవులు, భాస్కర్‌రెడ్డి, విష్ణు, ఈశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పామిడి: స్థానిక గుప్తాకాలనీ, టీచర్స్ కాలనీ, తలవాలకట్ట వీధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ తదితరులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూలకు 7 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

నేడు వాహనాల వేలం

యాడికి: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 19 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు 10 శాతం ధరావతు చెల్లించాలన్నారు.

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్ర వాహనాలు, ఒక బులెరో వాహనాన్ని వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.3 వేల ధరావత్తు చెల్లించి తగిన రసీదు పొందాలన్నారు.

ఆటోస్టాండ్ ఏర్పాటుకు అనుమతివ్వండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆటో యూనియన్ నాయకులు సోమవారం పంచాయతీ సెక్రటరి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఆటో స్టాండ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నాగేంద్ర, బాలు, భాస్కర్ వెంకటేశు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎండీయూ వాహనాల నిర్వాహకులతో తహసీల్దార్ రమాదేవి సమావేశమయ్యారు. బియ్యం సరఫరాలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే చింతకాయమంద పరిధిలో ఎండీయూ వాహనానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

కంపచెట్ల తొలగింపు

గుత్తి: పట్టణంలోని 20వ వార్డు తురకపల్లి రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. కౌన్సిలర్ కేవీ రమణ నేతృత్వంలో చిన్న జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను, చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

యల్లనూరు: స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపనున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ సమస్యపై ఓ ఫిర్యాదు అందగా.. వెంటనే సమస్యను పరిష్కరించాలని హౌసింగ్ ఏఈ సుప్రజకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, ఏపీఎం ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గుత్తి: ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో సునామ జకినీ మాత ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న సునామ జకినీ మాత ఆలయం వద్ద సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది చెత్త చెదారాన్ని తొలగించారు. దేవాలయం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించారు. శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే మా అభిమతం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- నాలుగో రోజుకు చేరిన ప్రజా సంక్షేమ యాత్ర



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: మండలంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర నాలుగో రోజు ఘనంగా ప్రారంభమైంది. బుర్నాకుంట గ్రామం నుంచి యాత్ర ప్రారంభం కాగా బందార్లపల్లి, అప్పేచర్ల , కడదరగుట్టపల్లి గ్రామాల మీదుగా క్రిష్టిపాడు గ్రామానికి చేరుకుంది. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. బందార్లపల్లి నుంచి అప్పేచర్ల గ్రామానికి వెళ్లే మార్గంలో వ్యవసాయ కూలీలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా? ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాత్ర అప్పేచర్లకు చేరుకోగా.. అక్కడ పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాత్రకు హిందూపురం మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ సంఘీభావం తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ప్రాణంగా అభిమానించే కార్యకర్తలను చంపించే దౌర్భాగ్యపు బుద్ధి జేసీ సోదరులకు మాత్రమే ఉందన్నారు. రాజకీయంగా ఎవరైనా నిలబడితే వారిపై కేసులు పెట్టించి కుటుంబాలు వీధిన పడేలా చేస్తున్నారని మండిపడ్డారు. అప్పేచర్లలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి హయాంలో క్రిష్టిపాడు సింగిల్ విండో అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డిని దారుణంగా హత్య చేయించారు. తరువాత బాధితుల ఇళ్లను కూల దోయించారని ధ్వజమెత్తారు. ఇలాంటి దారుణాలకు ఒడిగట్టిన ఘనత జేసీ సోదరులకు మాత్రమే దక్కుతుందన్నారు. రాజకీయ హత్యలకు ప్రేరేపించిన ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నకిలీ పత్రాలతో వాహనాల రిజిస్ట్రేషన్లు చేయించుకున్నా ఇప్పటి వరకూ పోలీసులు అరెస్ట్ చేయలేదన్నారు. తాడిపత్రి పట్టణంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైతే నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జేసీ ప్రభాకర్ రెడ్డికి తప్పుడు వాగ్దానాలు, ప్రచారాలు చేయడం ఆనవాయితీ అన్నారు. పెద్దవడుగూరు మండలానికి అత్యధికంగా ఇన్సూరెన్స్ అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో క్రైమ్ రేట్ చాలా తగ్గిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచం రామ్మోహన్, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, యాడికి మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, నగరూరు బ్రహ్మారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, సజ్జలదిన్నె రాజు, బీసీ విభాగం నాయకులు వెంకటస్వామి గౌడ్, శేషారెడ్డి, మధు, నాగరాజు, నాగభూషణ, మల్లేశ్వరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హరికృష్ణారెడ్డి, జాకీర్, రంగనాయకులు. మురళీ, సత్యంరెడ్డి, ఆది, మంజునాథరెడ్డి బాబురెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

పశువుల చెంతకే వైద్య సేవలు

యాడికి: మూగజీవాలకు వైద్య సేవలందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాయలచెరువులో యాడికి, పెద్దవడుగూరు మండలాల్లోని గ్రామాలకు ప్రభుత్వం కేటాయించిన డాక్టర్ వైఎస్సార్ పశు వైద్య ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్సార్ 108, 104 వాహన సేవలను ప్రారంభించి, వైద్య సేవలు అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి నోరులేని పశువులు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పశువుల వద్దకే వాహనం వచ్చి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారనానరు. పశువులు అనారోగ్యానికి గురైతే రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. పశు వైద్యుడు సంచార వాహనంలో వచ్చి, వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ ఖాదర్ బాషా, యాడికి పశు వైద్యాధికారి సుబ్బారెడ్డి, వాహన పశు వైద్యాధికారి దీప్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, తూట్రాళ్ల పల్లె సర్పంచ్ సంజీవరాయుడు, డీసీఎంఎస్ కమిటీ సభ్యుడు జగదీష్, నాయకులు నాగేష్, రషీద్, రవికాంత్, కాంపౌండర్ నరేంద్ర పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

గుత్తి రూరల్: పంటల సాగులో రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులను సాధించాలని గుంటూరు కమిషనరేట్ ఏడీఏ పూర్ణచంద్రరావు సూచించారు. సోమవారం మండలంలోని ధర్మాపురం వద్ద వేరుశనగ పంట పొలాలను అనంతపురం ఆత్మా పీడీ మద్దిలేటి, గుత్తి డివిజన్ ఏడీఏ నారాయణనాయక్‌తో కలిసి పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని పంటలు సాగు చేయాలన్నారు. పంట పొలాల్లో ఉన్న మిత్ర పురుగులను కాపాడుకోవడం వలన శత్రు పురుగుల ఉధృతిని అరికట్టవచ్చని తెలిపారు. విత్తనం విత్తే సమయంలో తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు రాకేష్ నాయక్, ప్రవీణ్‌కుమార్, శంకర్, రైతులు బేడలవెంకటరాముడు, నారాయణస్వామి, సురేష్ పాల్గొన్నారు.

పామిడి: పొలంబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని గుంటూరు కమిషనరేట్ ఏడీఏ పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని కండపల్లి ఆర్‌బీకే పరిధిలోని సొరకాయలపేట రైతు నాగయ్య వేరుశనగ పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, నాణ్యమైన విత్తనం, ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి సాధించడానికి పొలంబడి కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ డీ లీనా వసుంధర, టెక్నికల్ అసిస్టెంట్లు రాకేష్‌నాయక్, ప్రవీణ్‌కుమార్, శంకర్, సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఏఈఓలు శ్రీనివాస్, శివరాజ్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో విద్యార్థుల సత్తా



సుదీక్ష రెడ్డి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

బుక్కరాయసముద్రం: అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన బాలోత్సవంలో మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. జానపద నృత్యం, జానపద గీతాలు, వ్యాస రచన పోటీల్లో 3 బహుమతులు గెలుచుకున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన కీర్తి, అక్షయ, నవీన్, సంధ్యను ఉపాధ్యాయులు నీలకంఠారెడ్డి, దివాకర్‌రెడ్డి, రవీంద్ర, గోపాల్‌రెడ్డి, లలితమ్మ, కమిటీ చైర్మెన్ బాల చంద్రుడు అభినందించారు.

శింగనమల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుచున్న సుదీక్షరెడ్డి ఇటీవల అనంతపురంలో జరిగిన బాలోత్సవంలో దినపత్రిక పఠనంలో మొదటి బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ తెలిపారు. విద్యార్థిని సుదీక్షరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపింది.

నెట్టికంటుడి ఆలయంలో పూజలు



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు



తులాభారం ద్వారా బెల్లం సమర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

గుంతకల్లు రూరల్: కమలాపురం ఎమ్మెల్యే పీ.రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. సోమవారం వేకువజామునే ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేర్లతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన తులాభారం ద్వారా ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి స్వామికి బెల్లం సమర్పించారు.

గుంతకల్లు రూరల్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ మల్లికార్జున రెడ్డి సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు.. స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను ఆర్టీసీ చైర్మన్‌కు అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన నాయకులతో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని సీ.బండమీదపల్లి గ్రామానికి చెందిన 12 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం శింగనమలలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో వడ్డె నిట్టికంటి, వారి అనుచరులు నీరుగంటి శ్రీనివాసులు, బుల్లె నాగరాజు, శేఖర్, వీరాంజినేయులు, గోగుల రామాంజినేయులు, చిన్న వెంకటేష్, చౌడప్ప, దేరంగుల రామాంజినేయులు, ముంజుల శేఖర్, సంజీవ, వీరాంజినేయులు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, లోకనాథ్, సన్నమల్లయ్య, జయరాముడు, ఆదెప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోర్టుకు హాజరైన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యేలు

గుంతకల్లుటౌన్: కమలాపురం రైల్వేస్టేషన్‌లో రైల్‌రోకో ఘటనలో ఆర్పీఎఫ్ పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ నిమిత్తం సోమవారం ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మేరీ, ప్రసాద్‌రెడ్డి సోమవారం స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు. కోవిడ్ కంటే ముందు కమలాపురం రైల్వే స్టేషన్ మీదుగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను యథావిధిగా నడపాలని కోరుతూ గత యేడాది జనవరిలో రైల్‌రోకో నిర్వహించారు. అప్పట్లో ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు వీరు హాజరైనట్లు న్యాయవాది సి.గోపాలకృష్ణ తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు



పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా నారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వర స్వామి ఆలయాల్లోని హుండీ కానుకలను సోమవారం దేవాదాయ శాఖ అధికారులు లెక్కించారు. తాత్కాలిక, పర్మినెంటు హుండీల లెక్కింపు ద్వారా రూ.9.81 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పుణ్యస్నానాలకు విచ్చేసే భక్తులు నదీ లోతట్టు ప్రాంతాల్లోకి వెల్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

పామిడి: పట్టణంలోని మోడల్ స్కూల్‌కు షెక్షావలి (ఎమ్మిగనూరు ఆదర్శ పాఠశాల తెలుగు టీజీటీ), స్థానిక మహాలక్ష్మి రెడీమేడ్స్ ఓనర్ దినేష్ తదితరులు రూ.7,500 విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, పీడీ నరేష్, ఎస్ఎంసీ చైర్మన్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

గార్లదిన్నె: గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోటంకలో 243-1 సర్వే నంబర్‌లో భూమిలేని నిరుపేదలు సొంత ఖర్చులతో భూమి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్నారని 20 మందికి నోటీసులు జారీ చేశారన్నారు. భూమి లేని నిరుపేదలకు మాత్రమే నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. అందరికీ నోటీసులు జారీ చేసి, భూమి లేని వారికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి, సుధాకర్, నెట్టి కంటయ్య, కిష్టప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

గుత్తి: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం 20 మంది టీబీ రోగులకు కంది బేడలు, రాగి జావా, గోధుమ పిండి, ఆయిల్ ప్యాకెట్లు, కోడి గుండ్లు వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎల్లప్ప, టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు దేవదాస్, మన్సూర్, జాఫర్, బాషా, ఖాజాబీ, వైద్యులు కృష్ణ ప్రసాద్, నవీన్, రాముడు, దివ్య, జాన్సీ, యామిని, మంజుల, దివ్యారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మంజు భార్గవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు పంచాయతీ రాజ్ (క్వాలిటీ కంట్రోల్) ఈఈ మల్లికార్జున సోమవారం లైబ్రరీ పుస్తకాలు, ర్యాక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలను సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌కేసీ సేవా సమితి వ్యవస్థాపకుడు కమలనాథ్, ఉపాధ్యక్షుడు రమణ, సివిల్ ఇంజినీర్ అల్తాఫ్ ఖాన్, హెచ్ఎం బాబా ఫకృద్దీన్ పాల్గొన్నారు.

రేపు భీష్మ ఏకాదశి

తాడిపత్రి టౌన్: స్థానిక రెడ్డివారిపాలెంలోని కోదండ రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలు జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శేషాద్రి అయ్యంగార్ ఒక ప్రకటనలో తెలిపారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో అఖండ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర సహిత విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తామన్నారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి విగ్రహాన్ని జక్కలచెరువు గ్రామం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడిని పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. ధ్వజారోహణ, అంకురార్పణతో స్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తిరునాల సందర్భంగా ఆలయ ఆవరణలో భారీగా తిను బండారాలు, గాజులు, చిన్న పిల్లల ఆట వస్తువులు విక్రయించే దుకాణాలు వెలిశాయి. పెద్ద జాయింట్ వీల్‌లు, ఊయలలు ఏర్పాటయ్యాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ ఈఓ దేవదాసు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందేలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం సింహవాహనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

పుష్ప పల్లకీలో కొండమీద రాయుడి వైభవం



బుక్కరాయసముద్రం: కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పుష్ప పల్లకీలో కొలువు దీర్చి, పుర వీధుల్లో ఊరేగించారు. మహిళలు స్వామికి మంగళ హారతులు పట్టారు. మంగళవారం రాత్రి శ్రీవారు సింహ వాహనంపై ఊరేగనున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ పరిశీలించారు. కందకం పనులను చూసి, మస్టర్‌ను తనిఖీ చేశారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కూలీలకు సూచించారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

పామిడి: తప్పిపోయిన ఓ బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బెస్తవీధికి చెందిన మల్లికార్జున, ఉషారాణి దంపతుల కుమార్తె స్నేహిత ఆడుకుంటూ పక్కవీధిలోని పామిడమ్మ వీధికి చేరింది. ఈ వీధిలో బిక్కుబిక్కుమంటూ తిరుగుతున్న చిన్నారని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పాపను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, వీధుల్లో మైకులో ప్రచారం చేయించారు. అప్పటికే ఆందోళనతో తిరుగుతున్న మల్లికార్జున, ఉషారాణి దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

సజావుగా వాహనాల వేలం

పుట్లూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను వేలం వేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. వేలం ద్వారా రూ.2,00,600 ఆదాయం సమకూరిందన్నారు.

ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీ



తాడిపత్రి టౌన్: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: యువత మహాత్మా గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ సర్కిల్‌లో సోమవారం ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య కార్యదర్శి అశ్వర్థ రంగయ్య, కోశాధికారి వంకదార రాజా, వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కో–ఆర్డినేటర్ సుబ్బరామయ్య, టీటీసీ జిల్లా చైర్మన్ బండారు శివ, దూదేకుల సేవా సంఘం అధ్యక్షుడు నబీరసూల్, కోశాధికారి బాబయ్య, సభ్యులు నాగపీరయ్య, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

యాడికి: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు గాంధీజీ అని.. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఆర్యవైశ్యం సంఘం మండల అధ్యక్షుడు గాధం శెట్టి బలరామయ్య అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదిత్య, విశ్వనాథ్, జయవరం శేఖర్, రవి, రాఘవ, నితిన్ పాల్గొన్నారు.

గుంతకల్లు: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి ఆవోపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆవోపా పట్టణ అధ్యక్షుడు పి.చెన్నకేశవులు, కార్యదర్శి దారా రామోహ్మన్, కోశధికారి రాజారమణ, జిల్లా మాజీ అధ్యక్షులు గోపాజగదీష్, కౌన్సిలర్ కృపాకర్ హరిహరినాథ్ పాల్గొన్నారు.

శింగనమల: జాతిపిత మహాత్మగాంధీ ఆశయాలను నెరవేరుద్దామని వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పార్థసారధి అన్నారు. మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం వాసవి కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ సురేష్, ఆదిశేషయ్య, శేషయ్య, కిశోర్, నాగరాజు పాల్గొన్నారు.

శింగనమల: సమాజంలో కుష్టు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దని, ఇది అంటు రోగం కాదని ఎంపీడీఓ నిర్మలా కుమారి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

యాడికి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం, వేములపాడు వద్ద ఉన్న కస్తూరిబా విద్యాలయంలో సోమవారం ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవరాజన్ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు.